



# మట్టిపెళ్ళలు

## 'అంబుజా భూషణ్'

**ఆ ఏడు 'కాస్తో కూస్తో' పంట చేతికి రావటంతో ఊర్లో పండగ సంబరం కనబడుతోంది.**

**ఇళ్ళకి మామిడి తోరణాలు, వాకిళ్ళకి రంగవల్లులు శోభనిస్తున్నాయి. వీధులంతా పిల్లల ఆనందపు చిందులతో కళకళలాడుతున్నాయి.**

చేతిలో చెరుకుగడల్ని మనవడికందించి వేపచెట్టు కింద ఉన్న తొట్టిలోంచి నీళ్ళు తీసుకొని కాళ్ళు చేతులు కదుక్కుని ఇంట్లోకి నడిచాడు శివయ్య. ఇల్లంతా గారెల వాసనతో గుబాళిస్తోంది.

"అబ్బ ఎన్నాళ్ళకెన్నాళ్ళకి" శివయ్య వళ్ళంతా ఒక్కసారిగా పులకరించి నోట్లో నీళ్ళూరాయి.

"ఎక్కడికెళ్ళారండీ ఇంతసేపు పొద్దు చూడు ఎంతెక్కిందో" తువ్వాలు అందిస్తూ అన్నది తులశమ్మ.

"కామయ్యగారి కొట్టుదగ్గర కాస్త పనిబడిందిలే. పిల్లల భోజనాలయ్యాయా?" అడిగాడు.

"ఇదిగో మీరొచ్చిందాకా ఆగుతామన్నారు. రామం పిల్లల్ని పిల్చుకు రారా. సీతా వడ్డించవే" పీట వాలుస్తూ అన్నది తులశమ్మ.

"తాతయ్య పక్కన నేను నేనంటూ" బిలబిలా వచ్చి చేరారు మనవళ్ళు, మనవరాళ్ళు.

విస్తరాకులో వొకటొకటే వడ్డిస్తోంది కోడలు.

"చక్కెర పొంగలి, ముద్దపప్పు, నెయ్యి, నిమ్మకాయ పులిహోర, గొంగూర పచ్చడి గారెలు".

ఆత్రంగా విస్తట్లో చెయ్యి పెట్టబోతున్న వాడల్లా ఒక్కుదుటున పైకి లేచాడు శివయ్య.

"ఏమయింది నాన్నా! ఎక్కడికి?" రామం కంగారుగా అడుగుతుంటే" "మీరు తింటూ ఉండండిరా ఇప్పుడే వస్తా!" అంటూ బైటికి నడిచాడు.

ఆ ఊరు మొత్తం మీద ఖరీదైన ఆ మేడ చీకటికి నీడలా ఉంది. వంటరితనానికి తోబుట్టువులా ఉంది. నిశ్శబ్దానికి ప్రతీకలా ఉంది. వొకప్పుడు విచ్చలవిడిగా పెరిగిన బచ్చలి తీగ ఒడబడి ఉంది. పిచ్చపిచ్చగా పూసే జాజిపందిరి బోసిపోయి ఉంది.

వరండాలో ఒంటరిగా వాలుకుర్చీలో పండుకున్న సుందరయ్య అలికిడి విని కళ్ళు తెరిచాడు.

ఎదురుగా ప్రాణస్నేహితుడు శివయ్య.

"శివా నువ్వు.. నువ్వు మా ఇంటికి" అపనమ్మకంగా అడిగాడు.

"ఆ నేను రాకుడదేమిట్రా?"

"అదికాదు నా కోసం నన్ను క్షమించి" నీళ్ళు నమిలాడు.

100% AYURVEDIC PRODUCT

గ్యాస్ట్రబుల్‌తో బాధపడుతున్నారా? మలబద్ధకము తో ఇబ్బంది పడుతున్నారా? కడుపునొప్పి మొదలగు జీర్ణశక్తికి సంబంధించిన వ్యాధులకు అనేక సంవత్సరముల నుండి ప్రయోగములు చేసి చంద్రికా వారిచే తయారుచేయబడినటువంటి అతి ఉత్తమమైన ఆయుర్వేద మందు

క్యాప్‌జైమ్ చూర్ణము




జీర, ఇంగువ, సైంధవలవణం, యవాక్షారము, ఇసఫ్‌గోల్, మారీచము మొదలగు అనేక రకములైనటువంటి అతి ఉత్తమమైన ఆయుర్వేద మూలికలతో తయారుచేయబడినది.

ఈ క్యాప్‌జైమ్ చూర్ణమ్ తీసుకొనుట వలన ఎటువంటి సైడ్‌ఎఫెక్ట్స్ రావు

మార్కెట్ చేయువారు

రామా మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ & కో.
పార్కురోడ్, విజయవాడ - 1. ఫోన్ : 2424133.

"అంతా నీ అపోహ అదే లేదులే పోదాం పద లే" సుందరయ్య చెయ్యందుకున్నాడు.

"ఎక్కడికి"

"మా ఇంటికి"

"ఎందుకు?"

"చెప్తారా" తలుపులు దగ్గరకు లాగి తాళం వేసి సుందరయ్య భుజాన చెయ్యి వేశాడు.

పాత పెంకుటిల్లు సుందరయ్యని చూచి పలకరింపుగా నవ్వింది. వేపచెట్టు ఎంత ఎదిగిపోయావురా అన్నట్లుగా తల నిమిరింది.

"బాబాయిగారూ బాగున్నారా?" రామం అప్యాయంగా చెంబుతో నీళ్ళందించాడు.

"హాయ్ కొత్త తాతయ్య, కొత్త తాతయ్యా" ఉయ్యాలలూగుతున్న పిల్లలు సుందరయ్యని చుట్టుముట్టారు.

ఆ ఆప్యాయత, అనురాగాలకి ఏదో కొత్త లోకంలోకి వచ్చినట్లుగా ఉక్కిరిబిక్కిరైపోయాడు.

"ఆ ఇల్లు ఎంత ఇరుకుగా ఉందో మన సులంత విశాలంగా ఉన్నాయి" అత్తా కోడళ్ళిద్దరూ పోటీలు పడి వడ్డించసాగారు.

విస్తరి నిండా తనకిష్టమైన పదార్థాలు.. శివయ్య వైపు చూశాడు.

"ఊ కానియ్" అన్నట్లుగా చిరునవ్వు నవ్వాడు.

సుందరయ్య కళ్ళు ఆనందంతో మెరిశాయి, అపరాధభావంతో మసకబారాయి. ఆపై పశ్చాత్తాపంతో వర్షించాయి.

చెయ్యి కంచంలోకి పోనని మొరాయిస్తోంది.

అతని మనసు గతం పొరల్లోకి చొచ్చుకుపోయింది.

* * *

శివయ్య, సుందరయ్య ఒకే ఊరివాళ్ళు, ప్రాణస్నేహితులు. ఈతకెళ్ళాలన్నా ఈత కాయలు దొంగిలించాలన్నా, చెరుకుగడలు ఇరవాలన్నా చెరువులో కలువలు కోయాలన్నా కలిసిమెలిసి చేసేవాళ్ళు. వొకళ్ళని విడిచి వొకళ్ళు ఉండేవాళ్ళు కాదు.

ఊరు ఊరంతా వాళ్ళని లవకుశులనీ, రామలక్ష్మణులనీ పిలిచేవారు. టెన్త్ వరకు ఇద్దరూ కలిసి చదువుకున్నారు.

తర్వాత తండ్రిపోయి ఇంటి భారం శివయ్య మీద పడేసరికి చదువు మానేసి పొలం పన్లు చుసుకోసాగాడు.

సుందరయ్య పట్నంలో ఉన్న మేనమామ ఇంటికి పోయాడు పై చదువుల కోసం.

ఆ రోజు సుందరయ్యని బస్సెక్కిస్తూ వెక్కివెక్కి ఏడ్చాడు శివయ్య.

"ఏంట్రా నేనేదో అడవులకు వెళ్తున్నట్లుగా సెలవలకి రానూ" అంటూ తనూ కళ్ళు తుడుచుకుంటూ వోదార్చి వెళ్ళలేక వెళ్ళాడు.

తర్వాత ప్రతి శెలవులకి వచ్చినా తల్లి, తండ్రి పోయాక పల్లెని మరిచిపోయాడు.

కష్టాలు, నష్టాలు, ఆనందాలు, ఆశ్చర్యాలు, సందడులు, సంబరాల మధ్య కాలం వేగంగా దొర్లిపోసాగింది.

సుందరయ్య, శివయ్య ఇద్దరూ పెళ్ళిళ్ళు చేసుకున్నారు. పిల్లలూ కలిగారు. సుందరయ్య ఉద్యోగంలో ఒకోమెట్టూ ఎక్కుతూ ఎదిగి పోతుంటే శివయ్య మగసంతానం కోసం వరసగా నలుగుర్ని కని కష్టాల ఊబిలో చిక్కుకు పోయి కుంచించుకు పోసాగాడు.

ఎన్నో ఏళ్ళ తర్వాత ఎవరిద్వారానో సుందరయ్య అడ్రసు తెలిసి కొడుకుని వెంట బెట్టుకెళ్ళాడు శివయ్య.

సుందరయ్య ఇంటి ముందు కార్లతో, ఇంటి నిండా జనంతో కోలాహలంగా ఉంది.

మురికిబట్టిన బట్టలు, వడలిన శరీరాలు చేతిలో చిన్న గుడ్డ సంచి దిష్టిబొమ్మల్లా ఉన్న తండ్రీకొడుకుల్ని చూసి ముఖం చిట్లించాడు సుందరయ్య.

అతడ్ని చూడగానే శివయ్య కళ్ళల్లో కోటికాంతులు.

"రేయ్ సుందిగా ఎన్నాళ్ళు. ఎన్నేళ్ళయిందిరా నిన్ను చూసి?" ఉద్వేగంగా అల్లుకుపోయాడు.

సుందరయ్య ఇబ్బందిగా కదిలి అతని చేతులు విడదీస్తూ అన్నాడు "బాగున్నావట్రా?"

"ఇదిగో ఇలా ఉన్నాం. నేను అర్జెంటుగా చెల్లెమ్మని చూడాలిరా!"

"మా వాడు అమెరికా వెళ్ళబోతున్నాడురా! చూస్తున్నావుగా హడావిడి లోన ఎక్కడుందో?" శివయ్యని తన ప్రాణస్నేహితుడిగా పరిచయం చేశాక అహం, అంతస్తు అడ్డొచ్చింది.

"ఇంతకీ ఈ కుర్రాడు" రామాన్ని చూపిస్తూ అడిగాడు.

"నా కొడుకు రామం. ముగ్గురాడపిల్లల తర్వాత కలిగాడు"

"ఏంచేస్తున్నాడేమిటి?"

"బియ్యే పోయిందిరా, పూర్తి చెయ్యరా అంటే నాతోపాటే వ్యవసాయం చూసుకుంటు న్నాడు"

"అనుకున్నాలే పిల్లి కడుపున పులి పుట్టమంటే ఎట్లా పుడుతుంది?

"ఏరా! మీ నాన్నకెటూ చదువబ్బలేదు. నువ్వన్నా చదూకోకూడదూ

ఈ కాలం కుర్రాళ్ళకి సినిమాలు, షికార్లు, గుట్కాలు, మట్కాలు ఉంటే చాలు మరేం అక్కర్లేదు

యువకులు పట్టుదలతో, కష్టంతో వొక్కో మెట్టూ పైకెళ్ళి తనని నమ్ముకున్నవాళ్ళని సుఖ పెట్టలిరా. తోటివారికి ఆదర్శంలా ఉండాలిరా

ఎక్కడెక్కడివాళ్ళు ఇంజనీర్లు, డాక్టర్లు, ఎంబీఏలు, చేసి విదేశాలకెళ్తుంటే నువ్వేంటీ పల్లెనీ, పరుచుకున్న మన్నునీ కావలించు కుంటున్నావ్?

మట్టిని నమ్ముకుంటే మురికి, వాసనతప్ప ఏమీ మిగలవ్

కాలం మారింది. మా వాడు చూడు డిగ్రీల మీద డిగ్రీలు, మెడల్స్ మీద మెడల్స్ కొట్టేసి అమెరికా వెళ్తున్నాడు

జీతమెంతో తెల్సా నెలకి యాభైవేలు

పిల్లలు తల్లిదండ్రులకి ఆధారంగా ఉండాలే గానీ గుదిబండలుగా, గుండెల మీద కుంపట్లుగా ఉండకూడదురా

జాతి వజ్రాలుగా మారేలేగానీ మట్టిపెళ్ళ లుగా మిగలకూడదు

ఐనా శివా నీ బీదరికానికి తోడు అంత మంది పిల్లలెందుకురా? భూమికి భారంగా. నీలాంటి వాళ్ళ వల్లే దేశం ఇలా వంగ బడిపోతోంది.

నేను చూడు వొక్కడు చాలనుకున్నాను. అడిగినవన్నీ అమర్చిపెట్టాను. రాజాలా పెంచి అమెరికా పంపగలిగే స్థితిలో ఉన్నాను

దేనికైనా అదృష్టముండాలి. సర్లే మళ్ళెప్పు డన్నా కలుద్దాం

చూశావుగా ఇల్లెంత గందరగోళంగా ఉందో వస్తా విసవిసా లోనికెళ్ళాడు.

స్నేహితుడి మాటలకీ, నిర్లక్ష్యానికీ, తమ మీద చిన్నచూపుకీ తూటా దెబ్బతిన్న పక్షిలా విలవిల లాడుతూ వెనుతిరిగాడు శివయ్య.

చిన్ననాటి స్నేహితుడు, ప్రాణానికి ప్రాణంలా తిరిగినవాడు ఎన్నో ఏళ్ళ తర్వాత తనని వెతుక్కుంటూ వస్తే, అందరిలాగే కొడుక్కి వోదారి చూపించమని అడుగుతాడనీ, లేదా దరిద్రం వంక చూపి దానం చెయ్యమంటాడనీ నిర్లక్ష్యంగా ప్రవర్తించాడు.

మనసు విప్పి మాట్లాడలేదు, లోనికి రమ్మనలేదు. సరికదా! గ్లాసు మంచినీళ్ళన్నా ఇవ్వకుండా పంపించి వేశాడు.

అతని ఉద్యోగం, అధికారం, అంతస్తు, హోదా కళ్ళకి పొరలుకమ్మేలా చేశాయి.

శివయ్యలాంటివాళ్ళు పురుగుల్లా కనిపించ సాగారు.

రిటైరైన తర్వాత సొంత ఊరుకొచ్చి మేడ కట్టుకున్నాడు. కొడుకు పంపే డబ్బుతో పొలాలు కొనుక్కున్నాడు. ఇంటి నిండా ఖరీదైన సామాను, బైటికెళ్ళడానికి కారు కొనుక్కున్నాడు. ఆ ఊరికే మహారాజులా పెరిగిపోసాగాడు.

తీపి రుచిగా ఉంటుందని ఎంతకాలం తినగలం ఏదో ఒకరోజు వెగటు వేయక తప్పదు.

ఇంట్లో ఎన్ని ఉన్నా ఏదో లోటు కనిపించసాగింది. అది మనవళ్ళు మనవరాళ్ళ అల్లరి, ఆహ్లాదాల గలగలలని గుర్తించి, కొడుకు ఎప్పుడొస్తాడా అని ఎదురుచూస్తున్న ఆ ముసలి దంపతులకి చర్నాకోలులాంటి వార్త వచ్చింది కొడుకు నుంచి

"తను అమెరికా అమ్మాయిని పెళ్ళిచేసు కున్నా ననీ, ఇక్కడే స్థిరపడిపోతున్నానని."

కొడుకు మీద బెంగతో చనిపోయింది భార్య. అంతే అతని అదృష్టం తిరగబడింది.

ఖరీదైన మేడలో నీడలా మిగిలాడు

మనిషంతా దైన్యం, మనసంతా సూన్యం

ఎటుచూసినా అయోమయం. అటువంటి తరుణంలో స్నేహితుడు చేయందించి చైతన్యంలోకి తీసుకొచ్చాడు. సుందరయ్య అణువణువులో పశ్చాత్తాపం, సంతోషం పోటీపడసాగాయి.

"తినండి బాబాయిగారూ! ఇవన్నీ మీకిష్టం అటగా" రామం హెచ్చరించేసరికి సుందరయ్య కళ్ళల్లో నీళ్ళు జలజలా రాలాయి.

"బాబూ రామం నా కొడుకునో వజ్రంలా పోల్చి నిన్ను మట్టిపెళ్ళలా ఈసడించాను"

"వజ్రం మెప్పులకే చెప్పుకునేందుకే"

"మట్టిపెళ్ళలో పరిమళాలున్నాయనీ, అది వళ్ళంతా విరగదీసుకొని అరగదీసుకునైనా పైర్లకి జన్మనిస్తుందనీ, ఎన్నో ప్రాణాలని పోషిస్తుందనీ నిన్ను చూశాక మరోసారి రుజువైందిరా." మనసారా రామాన్ని హృద యానికి హత్తుకున్నాడు సుంద రయ్య.

*

## అమితాబ్ ఆణిముత్యాలు



భారతీయ చలనచిత్ర పరిశ్రమలో సూపర్‌స్టార్‌గా, 'బిగ్ బి' గా గౌరవం పొందిన అమితాబ్ బచన్ గురించి కొత్తగా చెప్పుకోవ లసినది కాని, తెలుసుకోవలసినది కాని ఏమీ లేకపోవచ్చు. అయితే ఇటీవల ఒక ఇంట ర్వ్యూలో బిగ్ బి ఎన్నో ఆసక్తికరమైన విష యాలు వెల్లడించారు. అందులో కొన్ని ఆణి ముత్యాలు.

* ఒకప్పుడు హీరో వేషాలు వేశాను. వయసు మీద పడటంతో ఇప్పుడు వయసుకి తగినట్లు క్యారెక్టర్ రోల్స్ ధరించడానికే ఇష్టపడుతు న్నాను.

* నన్ను 'సర్వాంతర్యామి' అంటూ వుంటారు. మనకి నచ్చిన అవకాశాలు ఎప్పుడు సద్వినియోగం చేసుకోవాలి. అందుకే టి.వి.లో 'కౌన్ బనేగా కరోడ్‌పతి' నిర్వహించాను. కొన్ని సందర్భాలలో గాత్రదానమూ చేశాను. టి.వి వ్యాపార చిత్రాలలో మోడల్‌గా కనిపించాను. ఇవన్నీ 'పార్ట్ ఆఫ్ ది గేమ్'గా చెప్పుకోవాలి.

* సంతృప్తి చెందాననే భావన సృజనాత్మకతకి అవరోధంగా నిలుస్తుంది. అందుకే కొత్తదనం కోసం కొత్త సవాల్ కోసం నేను ఎప్పుడూ ఎదురు చూస్తుంటాను.

* చలనచిత్ర పరిశ్రమలో సాంకేతిక విప్లవం చోటు చేసుకున్నా మౌలికంగా పరిశ్రమ స్వరూప స్వభావాలు మారవు.

* నేటి యువతరం ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నారు. రాజీపడే ధోరణిని విడనాడుతున్నారు. ఇది హర్షించదగ్గ పరిణామం.

* ఏ రాజకీయ పార్టీతోనూ నాకు సభ్యత్వం లేదు. ములాయంసింగ్, బాల్ థాకరే ఇలా ఎందరో మిత్రులున్నారు. వివిధ పార్టీలకు చెందిన ప్రముఖులు నాకు ప్రాణస్నేహితులు. ఆ కారణంగా నాకు 'రాజకీయాల రంగు' వేయడం తగదు.

-ఎ. నైపుణ్య